BHAVAVEENA
Vol. 16, Issue. 1(1), January - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# కందుకూరి - స్త్రీ నీతులు

- డా॥ జి. ఝాన్సీ రాణి, శాఖాధిపతి, తెలుగుశాఖ, బాపట్ల ఆర్ట్స్ & సైన్స్ కాలేజి, బాపట్ల.

భారతీయ సాహిత్యంలో స్త్రీని ఆదిశక్తిగా, శక్తి స్వరూపిణిగా అభివర్ణించారు. స్త్రీని పతివ్రతగా, శీలవతిగా, గుణవతిగా చిత్రించడం జరిగింది. "మాతృదేవోభవ" అంటూ మాతృమూర్తికి ప్రథమ పీఠం వేసింది. మాతృదేశం, మాతృభాష అని భూమిని, భాషను తల్లిలాగా భావించారు. కానీ వాస్తవానికొచ్చేసరికి అర్థంలేని ఆచారాలతో, కట్టుబాట్లతో, మూఢనమ్మకాలతో మగవారి దౌర్జన్యానికి గురై స్త్రీలు తమలోతాము కుమిలిపోయారు. పురుషాధిక్య సమాజంలో స్త్రీకి తగిన స్థానాన్నిగాని, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను గాని ఇవ్వలేదు. అనాదిగా స్త్రీ జాతి ఎన్నో అసమానతలను, అవమానాలను తలవంచి సహించింది. స్త్రీలకు విద్యను దూరంచేసి మేధస్సును ఎదగనివ్వకుండా చేసింది. స్త్రీది జన్మ జన్మల దు:ఖం. యుగయుగాల అవమానం. బాల్య వివాహాల పేరిట పసి మొగ్గలను చిదిమేసేవారు. సతీసహగమనం అంటూ బలవంతంగా చితినెక్కించేవారు. పుట్టినిల్లు పెనం లాంటిదైతే మెట్టినిల్లు పొయ్యిలాంటిది. పెనం మీంచి పొయ్యిలోకి అన్న సామెతలాగా ఆడవాళ్ళ జీవితం వుండేది. అలాంటి స్థితిలో స్త్రీలు ఎదుర్కొనే సంఘ దురాచారాల మీద దేశంలో వ్యతిరేకతలు సంస్కరణలు మొదలయ్యాయి.

ఆంధ్ర రాష్ట్రంలోను బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రథమ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు గారు సాహిత్యాన్నే ఆయుధంగా మలచుకొని సంఘ సంస్కరణకు శ్రీకారం చుట్టారు. భాషాభివృద్ధికి, దేశాభివృద్ధికి కొత్త జీవం పోసిన మహాస్రష్ట కందుకూరి. స్త్రీ విద్యను చైతన్యపరుస్తూ బాల్య వివాహాలను అరికడుతూ, కన్యాశుల్కాన్ని ఎదిరిస్తూ, వితంతు పునర్వివాహాన్ని ప్రోత్సహిస్తూ అహర్నిశలు అవిశ్రాంతంగా కృషి చేసారు. అణగదొక్కబడిన స్త్రీ జాతిని జాగృతం చేసి మేల్కొలిపిన ఘనత వీరేశలింగం గారిదే. అనేక సాహిత్య ప్రక్రియలకు ఆద్యుడైన కందుకూరి స్త్రీల అభ్యున్నతిని కాంక్షిస్తూ ప్రత్యేకంగా పత్రికలు నడిపారు, పలు రచనలు చేసారు అందులో ఒకటే స్త్రీ నీతి దీపిక.

## స్త్రీ నీతి దీపిక :

1884వ సంవత్సరంలో బాలికా పాఠశాలలోని బాలికల కొరకు శ్రీ కందుకూరివారు వంద పద్యాలను "స్త్రీ నీతి దీపిక" పేరిట రచించడం జరిగింది. ఇందులో 1. దైవభక్తి, 2.బంధుప్రీతి, 3.గురు భక్తి, 4. సత్యము, 5. సత్సహవాసము, 6. విద్య, 7. పతిభక్తి, 8. మిత వ్యయము, 9. సుగుణములు. 10.త్యాగము, 11.చౌర్యము, 12.అహింస, 13. కోపము, 14. పాటు, 15. శరీరారోగ్యము, 16.శాంతత్వము, 17. ధైర్యము, 18.గర్వము, 19.చాడి, 20.పరోపకారము, 21.సమబుద్ధి, 22.బాలశిక్షణము, 23.వివిధ ధర్మములు అని 23వ శీర్షికలతో వివిధ నీతులను బోధించారు. ఆనాటి కాలానికి అనుగుణంగా స్త్రీలకు ఈ నీతులవసరమని భావించి బాలికలకు బోధించివుండవచ్చు గాని ఈ నీతుల్లో 99 శాతం స్త్రీ పురుషులిద్దరికీ వర్తించేవే. అప్పటికే పురుషులు విద్య నేర్చుకుంటున్నారు కాబట్టి వారికి ఇవన్ని తెలిసుండవచ్చు కొత్తగా విద్య నేర్చుకొనే స్త్రీ (బాలికలు) లకు ఇవి తెలియకపోవచ్చునేమో అనే ఉద్యేశంతో ఇవి తెలియచెప్పే ప్రయత్నం అయి ఉండవచ్చు. స్త్రీలకు ఎంతో మేలు చేసి నిరంతరం స్త్రీల అభ్యున్నతికి పాటుపడిన కందుకూరి వారికి స్త్రీల పట్ల చిన్నచూపు ఎందుకుంటుంది? కానీ కందుకూరివారే ఊహించని విధంగా ఈనాడు స్త్రీజాతి ప్రగతి పథాన దూసుకెళుతున్న తరుణంలో ఈ నీతులు ఒక్క స్త్రీలకు మాత్రమే పరిమితం చేయడం సరికాదేమో స్త్రీ, పురుషులిద్దరికీ ఇవి వర్తిస్తాయి. కావున అందరూ చదువుకొని లబ్ధి పొందవచ్చు.

1. దైవభక్తి : ఎంతో మేలు చేకూర్చే ఆ భగవంతున్ని ప్రతి రోజు త్రికాలాలలో నిజమైన భక్తి శ్రద్ధలతో పూజించాలి. నిద్రకుపక్రమించేటప్పుడూ, నిద్రలేవగానే భగవధ్యానాన్ని చేయాలి. సంపదలు ఒనగూరినందుకు, ఆపదలను త్వరితగతిని తొలగించేందుకు "మఱువకుడి దైవమును వేద మగువలారా!" అని ఉద్బోధిస్తాడు.

భగవధ్యానం పాప చింతనను తగ్గిస్తుందనడంలో సందేహం లేదు. అయితే ఇది స్త్రీ పురుషులిద్దరికి అవసరమే. స్త్రీలు ఎదుర్కొనే అనేక కష్టాలకు భగవంతుని అండతో అధిగమిస్తామనే 'నమ్మకం' ఆమెలో మనో బలాన్ని పెంచుతుంది.

2. బంధుప్రీతి : తల్లి దండ్రులు, తోబుట్టువులతో, ప్రేమను గలిగి, అత్త మామలు, ఆడుబిడ్డల మనసు నొప్పించకుండా, అణకువతో నడుచుకోమంటాడు అంతేకాదు

"ఒక్క కడుపున పుట్టి, యొక్క కంచ
మునవె భుజియించి, యొక మంచముననే పండి .
యుండు తో(బుట్టుపడుచులు సోదరులును
నెప్పుడన్యోన్యమైత్రితో నొప్పవలయు. - (8వ పద్యం)

ప్రేమ, వాత్సల్యానికి ప్రతిరూపం స్త్రీ, ప్రేమను పంచి బంధువులను, అతిథుల్ని ఆదరించి అంతా నావారు అనే భావనతో కలుపుపోయే మనస్తత్వం స్త్రీలల్లోనే అధికం. పంతాలకు, పౌరుషాలకు పోయి బంధుత్వాలను దూరం చేసుకొనే మనస్తత్వం ఆనాడు ఎక్కువగా ఉండేది. అందుకేనేమో స్త్రీలకు ప్రత్యేకంగా

ఈ నీతిని చెప్పారు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారుతున్న ఈ కాలంలో అన్యోన్యమైత్రితో మెలగాల్సిన అవసరం స్త్రీ పురుషులిద్దరికీ ఉంది.

3. గురుభక్తి : "గురు స్సాక్షాత్ పరబ్రహ్మం" అనేది మన భారతీయ సంప్రదాయం. జ్ఞానాన్ని బోధించే గురువులు సాక్షాత్తు దైవ స్వరూపులు అందుకే

"విద్య నేర్పిన గురువుల విషయమునను
మిక్కలి కృతజ్ఞతను గల్గి మెలగ వలయు
వారలే తమ యుక్త ప్రవర్తనకును
దగు సహాయములని యెఱింగి తరుణిమణులు -
(9వ పద్యం)

అంటూ ఔచిత్య పూరితమైన సత్ప్రవర్తనకు గురువులే కారణమని పేర్కొన్నాడు. విద్య నేర్చే ప్రతి విద్యార్థిని, విద్యార్థికి ఇది చక్కటి సందేశం.

4. సత్యము : భువిలో సర్వ శుభాలకు నిలయం సత్యమైతే సర్వ పాపాలకు మూలం అసత్యం. కావున సత్యాన్నే పలకండి అది అంతులేని ఇహపరసుఖాలనిస్తుంది. ఏ ఒక్క విషయంలో అసత్యమాడినా జనులు మిమ్మల్ని ఎన్నటికీ నమ్మరు. నమ్మకం కోల్పోయిన తరువాత నరుల మధ్య బ్రతకడం కంటే చావుమేలు. అసత్యమాడినందుకు తల్లి దండ్రులు దండిస్తారు, భర్త తరుపు వారు నిందిస్తారు, తోటి వారు దూషిస్తారు అందుకని

చెలువ! యెపుడైన( దప్పింత చేసితేని,
నొకట మాఱు మాటాడక యొప్పుకొమ్ము
పొలతి! నీ తప్పు దా(చంగ బొంకితేని,
కాని పనులొక్కటికిని రెండౌను జుమ్ము - (14వ పద్యం)

అంటూ ఒక అబద్ధమాడితే దాన్ని కప్పిపుచ్చడానికి వెయ్యి అబద్ధాలు ఆడవలసి వస్తుందన్న లోక ప్రశస్తిని గుర్తుచేసారు. అస్వతంత్రులైన స్త్రీలు అభద్రతా భావంతో మూర్ఖపు కట్టుబాట్లకు భయపడి అసత్యాలు పలుకుతారేమోననే ఆందోళనతో కందుకూరి ఇలా చెప్పి ఉండవచ్చునేమో కానీ దుర్వ్యసనాలకు లోనై అసత్యాలతో సర్వ విధాల పతనమయ్యే పురుషులకు ఈ నీతి యొక్క అవసరం అధికంగా ఉంది.

5. సత్సహవాసము : మనం ఎటువంటి వారితో స్నేహం చేస్తామో అటువంటి వారి గుణాలే మనకూ అబ్బుతాయి. కనుక మంచి వారితోనే స్నేహం చేయాలి

జారిణులతోడ, సరిగాని వారితోడ(
దార్చువారితో, దాసీవితతుల తోడ,
వరుస దుర్గుణములు గల్గువారితోడ,
మైత్రి యొనరింప( జెల్లదు మగువకెపుడు - (16వ పద్యం)

అంటూ హితబోధ చేసాడు. భిన్నవ్యక్తిత్వం గలిగిన వారితో కలిసి మెలిసి స్నేహం చేసే పరిస్థితులు ఏర్పడినప్పుడు స్త్రీలు అమాయకత్వంతో వారిని నమ్మి మోసపోయే ప్రమాదముంది. కనుక ఆ విషయంలో తగు జాగురుకత వహించాలని హెచ్చరించాడు.

6. విద్య : జ్ఞాన సముపార్జనకు ఆలంబనము విద్య. సదసద్వివేకమును తెలియజేసే విద్యను "బాలురను బోలె( దప్పక బాలికలును విద్య నేర్పంగవలయును హృద్యముగను" అంటూ బాలికలకు విద్య తప్పనిసరి నొక్కి చెప్పారు. స్త్రీలకు కూడా విద్య యొక్క ఆవశ్యకత ఉందని కందుకూరి వారు గుర్తించినందుకు స్త్రీజాతి వారికి ఋణపడి ఉంటుందనడంలో సందేహం లేదు.

చదువుకుంటే సతీ సావిత్రి మొదలైన పుణ్యవతుల చరిత్రలు చదివి వారిలా తెలివిగా ప్రవర్తించ గలుగుతారు. స్త్రీలకు చక్కదనమునకు తోడు చదువుకూడా ఉంటే అందమైన పువ్వుకు పరిమళమబ్బినట్లు విద్యాగంధమబ్బిన స్త్రీలు తనరుచుందురు.

అయితే విద్య స్త్రీలకు ఏవిధంగా ఉపకరిస్తుందోనని ఆయన వివరించిన తీరు ఆశ్చర్యం కలిగించకమానదు. విద్య వలన వినయం వస్తుందని వినయం సర్వ గుణాలను ప్రకాశింపచేస్తుందని తద్వారా పతిభక్తి అలవడుతుందని చెబుతాడు. అంతేకాదు చదువులేని మూర్ఖత్వం కలిగిన మదవతియైన భార్యను పొందటం కంటే ఊరు విడిచి పెట్టి వనవాసమున కేగడం ఉత్తమం. ఇంటిలో స్త్రీ చదువుకుంటే ఇంటి వెచ్చాలు మరియు చాకలిపద్దు రాసి భర్త శ్రమను తగ్గిస్తుంది అని చెప్పడం నాటి స్త్రీలకు ఆవేదనను కల్గిస్తుంది. ఒక స్త్రీ విద్యావంతురాలైతే ఆకుటుంబం మొత్తం చైతన్యవంతమవుతుంది. ఈనాడు స్త్రీలు ఉన్నత విద్యలభ్యసించి వైద్యరంగం, బోధనారంగం, న్యాయ శాఖలో, రాజకీయాల్లో ఎదిగి అత్యున్నత పదవులలంకరించారు. ప్రగతి పథాన దూసుకెళ్తున్నారు. ఇంతటి మార్పు కందుకూరి వారు కూడా ఊహించలేదేమో! ఆనాటి పరిస్థితులను బట్టి అలా చెప్పుండవచ్చు. కానీ ఈ నాటికి కూడా అక్షరాలు నేర్వని, సంతకాలు కూడా చేయలేని స్త్రీలు ఇంకా మనమధ్యలోనే ఉన్నారన్నది చేదునిజం

7. పతి భక్తి : పతి భక్తికి సంబంధించి కందుకూరి నీతులు వింటే నేటి మహిళలు హతాశులవక మానరు. లోకంలో ఉన్న అన్ని సుఖాలకు భర్తే ఆధారం కావున స్త్రీ భర్తను దైవంగా చూడాలంటాడు. భర్త పని నుండి ఇంటికి తిరిగి వచ్చే సమయానికి బూచిలాగా తల విరబోసుకోకుండా సలక్షణంగా ఎదురేగి సంతోషపెట్టాలి. అలసివచ్చిన భర్తకు కాళ్ళు కడుక్కొవడానికి నీళ్ళు అందించి మంచి మాటలతో శ్రమను పోగొట్టాలే గాని ఇరుగు

పొరుగువారితోడి కలహాలను, సంసార బాధలను తెలపరాదు అంతేనా

'పురుషులొకవేళ( గోపంబు బూని సతుల(
బరుషములు పల్కి కొట్టిన, దిరుగ(బడక
యోర్చుకొనియుండి శాంతులైయున్నయపుడు
హితము బోధింపవలయుబో యిందుముఖులు

(27వ పద్యం)

అని సెలవిచ్చారు. ఒక వేళ భర్త దుష్టుడే అయినప్పటికి సమయం చూసుకొని సరసంగా మనస్సులో నాటుకునేటట్లు వివిధ ధర్మాలు తెలిపి సన్మార్గంలో నడిపించగలగాలి. కలలో కూడా భర్త దుర్గుణాలను, తప్పులను తలుచుకోరాదు. సద్గుణాలనే స్మరించుకుంటూ అతని పట్ల భయంతో భక్తితో మెలగాలి. దైవ సంకల్పం చేత అంగవిహీనులు, దరిద్రులైన భర్తలు లభించినా వారి యెడల భక్తితో మెలగాలి. పరపురుషులెంత సౌందర్య వంతులైనా, ధీరులు, శూరులు అయినా వారిని కన్నెత్తి చూడ రాదు. పర పురుషుల పొందు తృణప్రాయంగా ఎంచాలి. మంత్ర తంత్రాలకు మందు మాకులకు భర్తలు వశమవుతారనుట వట్టి మాట అట్టి భ్రమలు మానుకోవాలి.

పురుషుడూర లేకపోయిన( బూ(బో(డి
పూలు నగలు మేన( బూనరాదు
నిలువ(గూడ దింతి తలవాకిటను జేరి
నాతి పెద్ద పెట్టునవ్వరాదు. (34వ పద్యం)

అంటూ చాలా నీతులనే ఏకరువు పెట్టారు.

భర్త ఎలాంటి వాడైనా స్త్రీ కేవలం అతడ్ని ప్రేమించడానికి, సేవించడానికి, బాధలు పడడానికి మాత్రమే జన్మించలేదు. స్త్రీ ఒక మరబొమ్మ కాదు. ఆమెకీ మనసుంటుంది. కోరికలు ఉంటాయి, భర్తకోసం, కుటుంబం కోసం స్త్రీలు చేసే త్యాగాలు, సేవలు ఇంతింత కాదు. పతి భక్తి పేరిట స్త్రీలకు కొన్ని మెలకువలు బోధించినా ఈ నీతుల్లో అధిక భాగం పురుషులకు కూడా వర్తిస్తుంది ఎందుకంటే స్త్రీలు కూడా ఈనాడు బయటికెళ్ళి ఉద్యోగాలు చేస్తున్నారు గనుక.

8. మిత వ్యయము : కష్టపడి భర్త తెచ్చిన సంపదను మితంగా ఖర్చు పెట్టాలి. ఇంకా తెమ్మని భర్తను పీడించరాదు. ఇరుగు పొరుగు వారి సంపదలతో పోల్చుకోరాదు. కొంత మంది స్త్రీలు ఇతరులతో పోల్చుకుని అసంతృప్తితో రగిలిపోతూ తాను సుఖపడక కుటుంబంలోని వారిని సుఖంగా ఉండనీయక ఇబ్బందులు పెడుతుంటారు. అటువంటి వారికి ఈ సూక్తులు చాలా అవసరం.

9. సుగుణాలు : పువ్వులు, వస్త్రాలు, భూషణాలు స్త్రీకి శోభను చేకూర్చవని సుగుణమే సంపద అని ప్రపంచంలో ఏది ఎట్లైనా స్త్రీలు మాత్రం నీతిని విడువరాదంటాడు. స్త్రీ నీతి వంతురాలైతే తన సంతానాన్ని కూడా నీతిమంతులుగా తీర్చి దిద్దుతుందనే సంకల్పంతో కందుకూరి ఇలా బోధించి ఉండ వచ్చు. బాహ్య సౌందర్యం కన్నా అంత: సౌందర్యమే మిన్న అనియు తెలియజేసాడు

తుష్టి లేకయున్న దొరకదు సౌఖ్యంబు
కోట్ల కొలదిధనము కూడి యున్న(
గుడువ( గట్టనున్న( గొప్ప గృమములున్న
నొడలినిండ లక్షతొడవులున్న - (42వ పద్యం)

"సంతుష్టుడైన నరుడు ముల్లోకములందు పూజ్యుడు" అన్న పోతన మాటలు ఈ సందర్భముగా గుర్తు చేసుకోవచ్చు. ఈ నీతి పురుషులకు కూడా వర్తించినప్పటికి అసంతృప్తి చెందిన స్త్రీ వల్ల కుటుంబం మొత్తం అశాంతి పాలవుతుందని ఇలా చెప్పుండవచ్చు.

10. త్యాగం : "తానుచేసిన ధర్మంబే తన్ను కాచు" అన్న సూక్తిని స్త్రీలు మరిచిపోకుండా ఎల్లప్పుడు బీదలకు సాయం చేయాలని, తాను చాటుగా దాచుకున్న ధనంలో పెసరగింజంత కూడా దానం చేయకూడదంటాడు. దాచుకున్న సొమ్ము తనకు, తన కుటుంబ సభ్యులకు ఆపద సమయాల్లో ఉపయోగ పడు తుందనే ఆలోచన కందుకూరిదయ్యుంటుంది. దాస దాసీజనం పట్ల దయతో మెలగాలి తన శక్తి యుక్తులు బేరీజు వేయకుండా తొందరపడి ఇతరులకు మాటివ్వరాదని ఒకవేళ యిచ్చినట్లైతే దాన్ని నిలబెట్టుకోవాలని హితము చెప్పాడు.

11. చౌర్యము : దొంగతనము చేస్తే యజమాని శిక్షించు, ఇరుగుపొరుగువారు దూషిస్తారు, పరలోకంలో నరకబాధలు ప్రాప్తి స్తాయి. దొంగ తనము వలన ఎప్పటికైనా పట్టు పడతారు. ఒకవేళ పట్టుపడకపోయినా దైవమైనా శిక్షించకుండా విడిచిపెట్టదు. పరుల సొమ్ము గడ్డిపోచైనా వారి అనుమతి లేకుండా పొందితే శాశ్వతమైన అపకీర్తి కలుగుతుందంటారు.

ఇంటి గడప దాటని ఆనాటి స్త్రీలు ఇలాంటి నీచమైన పనికి ఎలా పూనుకుంటారు. పరుల సొమ్ముకు ఆశపడరాదనే నీతిని తెలియజేయడానికే ఇలా చెప్పుంటాడు కందుకూరి.

12. అహింస : అరికాల్లో ముల్లు గుచ్చుకున్నా ఎంత నొప్పిగా ఉంటుందో తెలిసిన నీవు జీవహింస ఎన్నడూ చేయకు ఎందుకంటే జంతువులకైనా మానవులకైనా బాధ ఒకటేకదా!

"ప్రాణకోటిపై దయగల్గు వారియందు
దైవమును జాల దయ గల్గి తనరు( గాన
సామజంబున కైనను దోమకైన
నిర్నిమిత్తంబుగా భాద నెఱపరాదు - (54వ పద్యం)

అంటూ భూత దయ గురించి చక్కటి నీతిని బోధించారు. మానవులందరూ అనుసరించవలసిన ధర్మమిది.

**13. కోపము :** సర్వపాపాలకు కోపమే మూలం. తిన్నగా మాట్లాడలేని వారు, తెలివితక్కువగా వున్నవారు తప్పుగా మాట్లాడినా వారిపై కోపం చెందకు అంటారు వీరేశలింగం గారు 'తన కోపమే తన శత్రువు' కాబట్టి అవివేకుల, అజ్ఞానుల లక్షణమైన కోపాన్ని ప్రతి ఒక్కరు విడిచి పెట్టడమే సముచితం.

**14. పాటు :** ఎంత సంపదవున్నా, ఇంటి నిండా పనివారు వున్నా స్త్రీలు ఎప్పుడూ తమ పనులను స్వయంగా చేసుకోవాలి. ఇంటిపనులు చేసేటప్పుడు దాసిలాగా భోగభాగ్యాలనుభవించే సమయంలో రాణిలాగా ఉండాలంటాడు నిజమే సోమరితనానికి దూరంగా ఉండటానికి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి స్త్రీ పురుష బేధం లేకుండా ప్రతి వారు పాటుపడడం ఎంతైనా అవసరం.

**15. శరీరారోగ్యము :** శరీరంపై మురికి వదిలేటట్లు ప్రతిరోజు స్నానమాచరించడం, శుభ్రమైన వస్త్రాలు ధరించడం అవసరం, వడగట్టిన శుభ్రమైన నీటిని తాగాలి. మితంగా తినాలి. వద్దన్న వారికి బలవంతంగా వడ్డించకూడదు. పరిశుభ్రమైన గాలి తగిలేటట్లు ఇంటి తలుపులు తెరిచి ఉంచాలి, దుర్గంధపూరితమైన గాలివల్ల అనేక రుగ్మతలు సోకుతాయని అంటూ పరిశుభ్రత గురించి చాలా విషయాలు తెలుపుతాడు. స్త్రీలే కాదు ఇంట్లోవున్న ప్రతి ఒక్కరు ఈ శుభ్రతలను పాటిస్తే అందరూ ఆరోగ్యంగా ఉండే అవకాశం వుంటుంది. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న ఆర్యోక్తిని మరువరాదు. ముఖ్యంగా స్త్రీ ఆరోగ్యంగా వుంటే ఆమెకు ఆరోగ్యవంతమైన సంతానం కలుగుతుంది.

**16. శాంతత్వము :** దాసదాసీజనులు తప్పు చేసినా సహించి మన్నించాలి. కోపం చెందక శాంతంగాఉండాలి. శాంత గుణం గొప్ప అలంకారమంటాడు. నిజమే ఈ అలంకారం అందరికీ అవసరమే.

**17. ధైర్యం :** ఆపదలు వచ్చినప్పుడు స్త్రీలు ధైర్యాన్ని వహించి ఉండటమే గాక తక్కిన వారిని ఓదార్చి ధైర్యం చెప్పాలి. ధైర్యంగా వుంటే సగం ఆపదలు తొలిగినట్లే. అని కందుకూరి గారు స్త్రీలకు బోధించారు. "ధైర్యే సాహసే లక్ష్మీ" కదా! స్త్రీలందరిలో ఉండాల్సిన ప్రథమ గుణం, ప్రధానమైన గుణం ఇదే అప్పుడే 'ఆడది అబలకాదు సబల' అనేది నిరూపితమవుతుంది.

**18. గర్వము :** స్త్రీ తనకున్న సౌందర్యాన్ని, సంపదలని చూసుకొని తనంతటి వారు లేరని విర్రవీగడం తగదు. ఎంత ఐశ్వర్యముంటే అంత అణకువగా ఉండాలి. ఎన్ని గుణాలున్నా అణకువ లేకపోతే వ్యర్థం. అణకువగా ఉండే వనితలను అందరూ గొప్పగా చూస్తారు అని వీరేశలింగం గారు పేర్కొన్నారు.

బహుశా బాలికలు తనంతటి వారు లేరని విర్రవీగితే జీవితంలో ఎదగలేరనే విషయాన్ని వారికర్థమయ్యే రీతిలో చెప్పుండవచ్చు. అహంకారం ఎవరికీ పనికిరాదు.

**19. చాడి :** చెప్పుడు మాటలు వినడం, మాట్లాడటం రెండూ అనర్థాలకు దారి తీస్తుంది. కావున ఇలాంటి మాటలకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలి.

**20. పరోపకారము :** "పరోపకారమిదం శరీరం" అనే సూక్తినే "పరోపకారంబు చేయుటయే కాదె యిల పయిని జన్మ మెత్తిన ఫలము మనకు" అంటూ కందుకూరి కూడా చెబుతూ స్వలాభం చూసుకోకుండా ఇతరుల మేలు కోసం పాటుపడాలి. ముఖ్యంగా లేమితనం అనుభవించేవారికి అండగా నిలబడాలి అని ఉదాత్తంగా బోధించారు. మానవ జన్మమెత్తిన ప్రతి వారు పాటించదగిన గొప్ప నీతి ఇది.

**21. సమ బుద్ధి :** సమత్వభావాన్ని ఈ క్రింది పద్యంలో అద్భుతంగా చెప్పారు కందుకూరి

ఎల్లరును నొక్కదైవంబె యిల సృజించెఁ
గావునను భేదమెంచక కలుకులార!
యక్కసెలి యంద్రవలెఁ జూడనగును స్త్రీలఁ
బురుషులను జూడవలయు సోదరులమాడ్కి
- (81వ పద్యం)

ఎదుటి వారిని గౌరవిస్తే మనకు గౌరవం కలుగుతుంది ఎదుటి వారిని గౌరవించక పోతే మనకు గౌరవం దక్కదు కాబట్టి స్త్రీ పురుష భేద భావం కూడా వీడి ఒకరి నొకరు గౌరవించుకుంటే ఇంకా బాగుంటుంది.

**22. బాల శిక్షణము :** తమ సంతానాన్ని నయానో భయానో మంచి దారిలో పెట్టలే గాని నోటికొచ్చినట్లు తిట్టి, గొడ్డును బాదినట్లు బాదితే తమలోని పశుత్వం బయట పడుతుందే గాని వారిని మంచి దారిలో పెట్టలేరని సుతిమెత్తగా మందలిస్తాడు. నిజమే సంతాన పెంపకం విషయములో భార్య భర్తలిద్దరూ చేపట్టాల్సిన లక్షణమిది. పూర్వం పిల్లల పెంపకం అచ్చంగా స్త్రీల బాధ్యతగా ఉండేది అందుకే స్త్రీలను ఉద్దేశించి చెప్పి వుండవచ్చు.

**23. వివిధ ధర్మాలు :** ఈ శీర్షిక క్రింద పదిహేను నీతులను బోధించాడు అవి -

1) ఎదుటి వారు నీపట్ల ఎలా ఉండాలని కోరుకుంటావో నీవు కూడా ఎదుటి వారిపట్ల అదే విధంగా ప్రవర్తించాలి.
2) ఊరక తిని కూర్చుని పదిమందిని పోగేసి ఎదుటి వారి తప్పులెన్నుట తుచ్ఛ గుణము.
3) దివ్యాంగులను చూచి నవ్వరాదు. అట్టివారికి చేతనైన సాయం చేయాలి.
4) ప్రతిరోజు సూర్యోదయానికి ముందే లేచి దంత ధావనం చేసి, పాచి పనులుచేసి ఇంటిని పరి శుభ్రంగా ఉంచుకోవాలి.
5) ఇతరుల సంపదలను చూచి ఈర్ష్యాసూయలను చెందుట

దుర్గుణం కావున అసూయను విడిచి తోటి వారు మెచ్చే విధంగా నడుచుకోవాలి.

6) ఇతరులు చేసే మేలును ఎన్నటికీ మరువక వారి నుండి పొందిన మేలు కొంచమైనా దాన్ని గొప్పగా భావించి వారికి తగిన ఉపకారం చేయాలి.

7) ఇంటిగుట్టు పరులకు తెలియకుండా స్త్రీ గుంభనంగా నడుచుకోవాలి.

8) ఇక్కడి మాటలు అక్కడ అక్కడి మాటలు ఇక్కడ చెప్ప రాదు.

9) ఇరుగు పొరుగు వారితో పరుష వాక్యలు పలుకక, కలిసి మెలిసి వుండాలి.

10) భోజనాల సమయంలో వారువీరనే భేదభావం చూప కుండా అందరికీ ఒకే రీతిగా వడ్డించాలి.

11) పుట్టింటి వారు శ్రీమంతులై, భర్త పేదవాడైనా భర్తను విడిచి పెట్టిపోరాదు.

12) భార్య వల్లే భర్తకు కీర్తి, అపకీర్తి కలుగును కావున స్త్రీ ఎప్పుడు సన్మార్గమున మెలగవలెను.

13) కుట్టుపని నేర్చుకుని తన బట్టలను తానే స్వయంగా కుట్టుకోవాలే గాని పొరుగు వారిని కుట్టమని అడుగరాదు.

14) సేవకులకు పనులు చెప్పేటప్పుడు అది చేయు, ఇది చేయి అని అజమాయిషీ చేయక, అమ్మా అయ్యా అని వేడుకొనుచూ పనులు చెప్పాలి.

15) చిన్న వయస్సులోనే చక్కగా వంటనేర్చుకొని ప్రతిరోజు ఇంటిల్లిపాదికి వేళపట్టున వంటచేసి భోజనం పెట్టాలి.

స్త్రీల పురోభివృద్ధిని బలంగా కాంక్షించి అందుకోసం బహువిధాలుగా ప్రయత్నించి పోరాడిన కందుకూరి వీరేశలింగం గారు రచించిన ఈ స్త్రీనీతి దీపికలోని నీతులను ఆనాటి స్థితిగతులు, సామాజిక పరిస్థితులు దృష్ట్యా రచించినవే అయినప్ప టికి వాటిని ఈ క్రింది విధంగా విభజించి అన్వయించుకుంటే సమంజసంగా వుంటుదేమో.

1) స్త్రీ పురుషులు అనుసరించవలసిన నీతులు :- బంధుప్రీతి, గురుభక్తి, సత్యము, సత్సహవాసము, విద్య, మిత వ్యయాలు, సుగుణాలు, త్యాగాలు, పాటు, శరీరా రోగ్యము, శాంతత్వము, పరోపకారము, సమబుద్ధి, బాల శిక్షణము, వివిధ ధర్మాలు.

2) స్త్రీ, పురుషులు అనుసరించరాని నీతులు : చౌర్యము, అహింస, కోపము, గర్వము, చాడీ

3) స్త్రీలకు ప్రత్యేకముగా ఉండాల్సిన నీతులు : ధైర్యం

4) స్త్రీలను ఇబ్బంది పెట్టే నీతులు : పతి భక్తి, వివిధ ధర్మాలులో 12,13,15 ధర్మాలు, స్త్రీ ముందంజ వేస్తే సంఘం ముందంజ వేస్తుంది. దాని వలన దేశం ముందం జ వేస్తుంది. ఆపై ప్రపంచమే ముందకు సాగుతుంది అని నమ్మి స్త్రీ జనోద్ధరణ కొరకు కంకణం కట్టుకున్న కందుకూరి నీతులు స్త్రీ, పురుషులిద్దకీ అన్వయించుకుని పాటిస్తే మన సమాజం మరింత ప్రగతి సాధిస్తుందని ఆశిద్దాం.